క్లుప్తంగా

ప్రగతి కోసం ప్రణాళిక



గాదెలవలసలో మాట్లాడుతున్న ఎంఈవో సూరిదేముడు

సీతానగరం: విద్యార్థుల ప్రగతి కోసం ఉపాధ్యాయులు ఒక ప్రణాళిక రూపొందించేందుకు సమాయత్తం కావాలని ఎంఈవో జి.సూరిదేముడు అన్నారు. మండలంలోని బూర్జ, గాదెలవలస, సీతానగరం ఉన్నత పాఠశాలల్లో శనివారం ఆయా ఉన్నత పాఠశాలల హెచ్ఎంల అధ్యక్షతన క్లస్టర్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. గాదెలవలస క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎఫ్ఏ 1 పరీక్షలు, సీ, డీ గ్రేడ్‌ల విభజన అంశాలు, సిలబస్ పూర్తి చేసేందుకు టీచర్ హ్యాండ్‌బుక్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల హాజరును మధ్యాహ్నం 1 గంటకు, సాయంత్రం 5 గంటలకు ముఖ గుర్తింపు ద్వారా నమోదు చేస్తారని అన్నారు. విద్యార్థుల ఫీడ్ బ్యాక్ ఫారం సమర్పించేలా చూడాలన్నారు. సీతానగరం ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన క్లస్టర్ సమావేశాన్ని ఎంఈవో 2 ఎం.వెంకటరమణ నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం



పాత పోస్టాఫీస్ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం

మక్కువ: స్థానిక పాత పోస్టాఫీస్ వీధిలో శనివారం సర్పంచ్ ఒంటి రామలక్ష్మి పర్యవేక్షణలో సీసీ రోడ్లు, కాలువల పనులను ప్రారంభించారు. గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులతో సి.సి రోడ్లు, రోడ్డుకి ఇరువైపులా కాలువల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, కాలువలు, తాగునీటి కల్పన, పారిశుధ్య పనులను చేపడుతున్నామన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



ఎంఎల్ఎస్ పాయింట్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వైశాలి

మక్కువ: మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్ (చౌక ధరల దుకాణం)ను పార్వతీపురం సబ్ కలెక్టర్ డా.ఆర్.వైశాలి శనివారం తనిఖీ చేశారు. పాయింట్‌లో రికార్డులను, నిల్వలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆమె ఆదేశించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. రేషన్ పంపిణీ సమయంలో ఎటువంటి అవకతవకలు పాల్పడిన తేదీలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ కె.భరత్‌కుమార్, సీఎస్‌డీటీ వై.హేమంత్ కుమార్ తదిరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ఆందోళన



స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆటో కార్మికులు, సీఐటీయూ నాయకుల ఆందోళన

పార్వతీపురం టౌన్: ఉచిత బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని ఈ మేరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నేతకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో టీడీపీ నేతకు వినతిపత్రం అందజేశారు. ఆటో కార్మికుల ఉపాధి దెబ్బ తినకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొనేలా కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన వాహనమిత్ర తరహా పథకాన్ని రూపొందించి ఏడాది రూ.25వేలు పరిహారం చెల్లించాలని, ప్రతీ నెల ఆటో కార్మికులకు పింఛన్ చెల్లించాలని ఆటో ట్యాక్సీలపై తీసుకున్న రుణాలపై మాఫీ విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ, కోశాధికారి జి.వెంకటరమణ, పట్టణ కన్వీనర్ సూరిబాబు, ఆటో యూనియన్ నాయకులు చిన్న, నాగభూషణరావు శంకరరావు, సింహాచలం, రవికుమార్ తదితరులు ఉన్నారు.

పిల్లల భవిష్యత్ కోసం.. ఒక్కటయ్యారు...



మూడు తరగతులకు ఒకే గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- పూరి పాకలతో పాఠశాలను నిర్మించుకున్నారు..
- కూటమి ప్రభుత్వం తమ ఆశలను సమాధి చేసిందంటున్న గిరిజనులు

పార్వతీపురం రూరల్: తమ పిల్లలు చదువుకొనే పాఠశాలలో సదుపాయాలు ఉంటే మెరుగైన విద్య అందుతుందని ఆశపడిన ఆ గిరిజనులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తీవ్ర నిరాశనే మిగిల్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండో విడత నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణం నిమిత్తం నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి పై కప్పు ఎత్తు వరకు గోడలు నిర్మాణం చేపట్టింది. అయితే ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో ఆ గ్రామం వైపుగాని, వారికి ఉన్న సమస్యల వైపుగాని చూడడం మానేసింది. దిక్కుతోచని స్థితిలో ఏమీ చేయలేని ఆ గిరిజనం తమ సొంత ఖర్చులను వెచ్చించి తమ చిన్నారులు చదువుకొనేందుకు ఓ గుడిసెను నిర్మించారు. ఈ ఘటన పార్వతీపురం మండలం పెదమరికి పంచాయతీ కొత్తఊరిలో చోటు చేసుకుంది.



అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం



స్వచ్ఛందంగా తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన పూరి పాక



మరుగుదొడ్లు లేక ఊట గెడ్డల వైపు వెళ్తున్న చిన్నారులు

కాళ్లరిగేలా తిరిగారు..

కొత్తఊరులో ఒకటి నుంచి 5 తరగతులకు సంబంధించి దాదాపు 50మంది విద్యార్థులు గ్రామ పాఠశాలలో చదువుతున్నారు. ఒకే గదిలో మూడు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు తమ తరగతులకు చెందిన పాఠాలు అర్థంకాని పరిస్థితుల్లో ఆ చిన్నారుల తల్లిదండ్రులు సమస్య పరిష్కారానికి నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలంటూ కొద్ది నెలలుగా సంబంధించిన కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగారు. వారి సమస్యను పరిష్కరించే నాయకులుగాని, అధికారులుగాని కనుచూపు మేరలో కనిపించకపోవడంతో అసంతృప్తి చెంది నిరాశతో మరో తరగతిని నిర్వహించేందుకు తాత్కాలికంగా వారే ఒక పూరి పాకను నిర్మించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



గత ప్రభుత్వంలో పక్కా భవనం నిర్మించేందుకు నిధులు మంజూరై శరవేగంతో పనులు ప్రారంభమై పూర్తవుతుందన్న నేపథ్యంలో ఎన్నికలు సమీపించిన అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఈ ప్రభుత్వంలో పాఠశాల నిర్మాణం పూర్తి చేస్తారని కొన్నాళ్లు ఎదురు చూశాం. ఫలితం లేకపోవడంతో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంబంధిత అధికారులను కలిసి విన్నవించాం. స్థానిక ఎమ్మెల్యేకు కూడా సమస్యను వివరించాం. పరిష్కారం మాత్రం జరగలేదు. ప్రస్తుతం నిర్వహణలో ఉన్న భవనం కూడా శిథిలావస్థకు చేరింది. చిన్నారులను దృష్టిలో పెట్టుకోనైనా ప్రభుత్వం స్పందించి పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలి. ప్రహరీ నిర్మాణంతో పాటు మరుగుదొడ్లు వాడుకకు, తాగునీరు సౌకర్యాలు కల్పించాలి.

– మెల్లిక జనార్ధన్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, కొత్తఊరు

బంకులో ఆయిల్ తక్కువ కొట్టారంటూ వాదులాట



సిబ్బందితో వాదిస్తున్న వినియోగదారులు

మక్కువ: స్థానిక శ్రీసాయి సూర్య ఫిల్లింగ్స్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బందిపై వినియోగదారులు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. మక్కువ నాయుడువీధికి చెందిన యువత శనివారం వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనానికి డీజిల్ అవసరం కాగా, చోడవరపు అప్పారావు అనే వినియోగదారుడు పెట్రోల్‌బంక్‌కు వెళ్లి, వెయ్యి రూపాయిలు సిబ్బందికి ఇచ్చి డీజిల్ కొట్టాలని, రెండు 5లీటర్ల డబ్బాలు ఇచ్చాడు. సిబ్బంది 800 రూపాయిలు డీజిల్ కొట్టి, వెయ్యి రూపాయిలు బిల్లు ఇచ్చారు. ఎంత కొట్టావని అడగ్గా, వెయ్యి రూపాయిలు డీజిల్ కొట్టానని సిబ్బంది తెలపగా అప్పారావు పెట్రోల్ బంక్ నుంచి వెళ్లిపోయారు. డీజిల్ తక్కువగా ఉన్న విషయాన్ని నాయుడువీధికి చెందిన యువత గుర్తించి, బిల్లు చూడగా వెయ్యి రూపాయిలు బిల్లుపై ఉంది. వెంటనే యువత పెట్రోల్‌బంక్ వద్దకు చేరుకొని, సిబ్బందిని డీజిల్ ఎంత కొట్టావని ప్రశ్నించారు. 800కొట్టానని, 200రూపాయిలు చిల్లర ఇచ్చేలోపు వినియోగదారుడు వెళ్లిపోయారని తెలిపారు. అటువంటి అప్పుడు 1000రూపాయిలు బిల్లు ఎందుకు ఇచ్చావని నిలదీశారు. అక్కడ ఉన్న పెట్రోల్ బంక్ నిర్వాహకుడు నరసింహరావును యువత అడగ్గా, నాకు సంబంధం లేదంటూ అనడంతో వినియోగదారులు వాగ్వాదానికి దిగారు. పెట్రోల్ బంక్‌ను నిర్వాహణ చేసే వారే సంబంధం లేదంటే ఎలా అని ప్రశ్నించారు. విషయాన్ని తెలుసుకున్న పెట్రోల్ బంక్ యాజమాన్యం సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

సెప్టెంబర్ 13, 14 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించిన కార్మికులు

బలిజిపేట: పాలకొండలో సెప్టెంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ 11వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కన్వీనర్ కె.దాలమ్మ, కో కన్వీనర్ యు.లక్ష్మి కోరారు. దీనికి సంబంధించి వాల్‌పోస్టర్లను బలిజిపేటలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు స్వాతంత్ర్యకు పూర్వమే పోరాడి సాధించుకున్న 8గంటల పని హక్కును హరిస్తూ 12గంటల పని విధానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చాయన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపునకు తరలిరండి



తోటపల్లి కాలువలో గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న కృష్ణమూర్తినాయుడు

సీతానగరం: గరుగుబిల్లి మండలం తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని సీతానగరం మండలం నీలకంఠాపురం గ్రామం దగ్గర తోటపల్లి ప్రధాన కాలువలోని నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న గుర్రపు డెక్కను తొలగించేందుకు రైతులు, సామాజిక కార్యకర్తలు తరలిరావాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు పిలుపునిచ్చారు. నీలకంఠాపురం వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్కను శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇక్కడి రైతులు తోటపల్లి ప్రధాన కాలువలోని నీటి ప్రవాహాన్ని గుర్రపు డెక్క అడ్డుకుంటుందన్నారు. సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీంతో తమ సంస్థ ఆధ్వర్యంలో రైతులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల భాగస్వామ్యంతో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. పాల్గొనే వారు 8555913959 నంబరును సంప్రదించాలన్నారు.

కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కేవీకే, గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమాజ్యోతి

పాచిపెంట: కుటుంబ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని కృషి విజ్ఞాన కేంద్రం (రస్తా కుంటుబాయ్) గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త ఉమా జ్యోతి అన్నారు. పాచిపెంట వ్యవసాయ శాఖ కార్యాలయంలో గిరిజన మహిళల ఆర్థిక అభివృద్ధికి పలు సూచనలు సలహాలను అందించారు. కుటుంబం ఆర్థికంగాగాని, సామాజికంగాగాని అభివృద్ధి చెందాలంటే మహిళల పాత్ర ఎంతో అవసరం అన్నారు.

పది మంది గిరిజన మహిళలు వస్తే వారికి చిరుధాన్యాలు వాటి ఉత్పత్తుల విలువల పెంపు అలాగే అటవీ ఉత్పత్తులకు విలువల జోడింపు వంటి పలు అంశాలపై ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. గ్రామైక్య సంఘం ద్వారా లేదా మండల సమాఖ్య ద్వారా కృషి విజ్ఞాన కేంద్రానికి దరఖాస్తులు పెట్టుకోవచ్చని తెలిపారు. చింతపండు బ్లాక్‌ల తయారీ తేనెటీగల పెంపకం చిరుధాన్యాలతో కురుకురే బిస్కెట్లు తయారీ వంటి వాటిపై కూడా పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తామని చెప్పారు. చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో కె.తిరుపతిరావు శతాభి సర్పంచ్ రామయ్య వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ లక్ష్యాలను సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో 1

బలిజిపేట: స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ లక్ష్యాలను సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో–1సామల సింహాచలం తెలిపారు. బలిజిపేట, వంతరాం క్లస్టర్ కాంప్లెక్స్‌ల సమావేశాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లస్టర్ కాంప్లెక్స్ ద్వారా వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, ఉపాధ్యాయుల నైపుణ్యాలను పంచుకోవడం, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు దోహదపడుతుందన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో సమర్థవంతంగా ఉపయోగించి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయా క్లస్టర్ కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు వి.వెంకటరమణ, చిన్ని వెంకటరమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన మత్స్యకారుల సంక్షేమాన్ని పట్టించుకోని 'కూటమి'



ఎంపీపీ బద్నాన ప్రమీల

పాచిపెంట:

గిరిజన మత్స్యకారుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తుందని ఎంపీపీ బద్నాన ప్రమీల అన్నారు. గిరిజన మత్స్యకారుడు జన్ని బాలరాజు ఈ నెల 27వ తేదీన పెద్దగెడ్డ జలాశయంలో గల్లంతై మృతదేహం లభ్యమైన నేపథ్యంలో శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు సంవత్సరం మూడు నెలలు అవుతున్నప్పటికీ, గిరిజన మత్స్యకారులకు సబ్సిడీ ద్వారా అందించవలసిన బోట్లు, సేఫ్టీ జాకెట్లు, వలలు అందించే పరిస్థితి లేదన్నారు. పొట్టకూటి కోసం వేటకు వెళ్లిన గిరిజన మత్స్యకారులు, ప్రమాదవశాత్తు నాటు పడవలు బోల్తా పడే సమయంలో సేఫ్టీ జాకెట్స్ లేకపోవడంతో జలాశయంలో గల్లంతై మత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా వేటకు వెళ్లి ఇప్పటివరకు సుమారు ఆరుగురు వరకు గిరిజన మత్స్యకారులు మృతి చెందారని, గిరిజన మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలా గిరిజనులు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. పెద్దగెడ్డ జలాశయానికి సాగునీరు విడుదలకు వచ్చిన మంత్రి సంధ్యారాణి గిరిజన మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానని చెప్పిన మాటలు, నీటి మూటలుగా మిగిలాయన్నారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, కలెక్టర్, ఐటీడీఏ పీవో తక్షణమే స్పందించి గిరిజన మత్స్యకారులకు సబ్సిడీపై బోట్లు, లైఫ్ జాకెట్లు, వలలు అందజేయాలన్నారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం:

గ్రామాల్లోని వరిచేను మళ్లల్లో ఏపుగా పెరుగుతున్న వరిచేనులో కనిపిస్తున్న తెగుళ్ల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో ఎస్.అవినాష్ అన్నారు. ఆర్.వెంకంపేట, కాశీపేట గ్రామాల పొలాల్లో వరిచేను పంటలను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరిచేనులో ఆశించిన రసం పీల్చు పురుగులు నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు క్రిమి సంహారక మందులు వేయాలని సూచించారు. ముందుగా రసం పీల్చు పురుగులు ఉధృతిని తగ్గించడానికి యల్లోస్టికీ కార్డ్స్ ఉపయోగించాలని అన్నారు. రసం పీల్చు పురుగులు, కుళ్ల తెగుళ్ల నివారణకు వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని కోరారు.

భోజన బిల్లులు చెల్లించండి

పార్వతీపురం టౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే నిర్వాహకులకు చెల్లించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు డిమాండ్ చేశారు. విద్యా శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి బకాయిల చెల్లింపులు చేయాలని కోరారు. అలాగే ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పీడీలు లేని కళాశాలలకు వ్యాయామ అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు.

కౌన్సిల్‌లో ఆమోదాలే తప్ప అభివృద్ధి లేదు..

- పనులు జరిగేలా మంత్రి చొరవ చూపాలి
- ఏరియా ఆసుపత్రి రింగ్ రోడ్డుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి
- లంచాలు ఇస్తేనే టౌన్ ప్లానింగ్ అధికారులు పనులు చేస్తారా?
- కౌన్సిల్ సమావేశంలో సభ్యులు గరం గరం



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

సాలూరు: మున్సిపాలిటీలో రూ.2 కోట్ల అప్పు డబ్బులు మంజూరై నెలలు దాటుతున్నా, ఆ డబ్బులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఇంకెప్పుడు ప్రారంభిస్తారని, ఆ అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని కౌన్సిలర్లు గిరి రఘు, వంగపండు అప్పలనాయుడు, రాపాక మాధవరావు, సింగారపు ఈశ్వరరావు, వెంకటరమణ, బలభద్రుని శ్రీనివాసరావు తదితరులు అధికారులను నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన కమిషనర్ రత్నాకర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. శ్యామలాంబ పండగకు ముందు రూ.2 కోట్ల అప్పు డబ్బులతో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపి, నాడు కౌన్సిల్‌లో పెట్టగా తామంతా ఆమోదించామని గుర్తు చేశారు. పనులకు ఆమోదం తెలిపినా ఆ పనులు చేపట్టలేక తిరిగి ఆ పనులకు కౌన్సిల్ ఆమోదించలేదంటూ.. అధికార పార్టీ నేతలు అసత్యాలు చెప్తారన్నారు. పండగకు ముందు కౌన్సిల్ ఆమోదించిన ఈ పనులకు ఇంకెప్పుడు చేపడతారని, పనులు ఆమోదమే తప్ప పనులు చేపడుతున్న దాఖలాలు లేవని కౌన్సిలర్లు మండిపడ్డారు. మంజూరు చేసిన పనులకు కాంట్రాక్టర్‌లు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వంద పడకల ఆసుపత్రి వద్ద అప్రోచ్ రోడ్డుతో కూడిన రింగ్‌రోడ్డు కోసం సుమారు 30 లక్షల రుపాయిల జనరల్ ఫండ్ నుంచి నిధుల నుంచి కేటాయింపు చేయాలని మంత్రి సంధ్యారాణి సూచించారని అధికారులు అజెండాలో పెట్టగా దానిని కౌన్సిలర్లు వ్యతిరేకించారు. ఇప్పటికే మున్సిపాలిటిలో ఉద్యోగులు, సిబ్బందికి జీతాలు ఇవ్వడానికే మున్సిపాలిటిలో డబ్బులు లేకపోవడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కావున మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకువెళ్లి రింగురోడ్డు కోసం ఆమె ప్రత్యేక గ్రాంటును ప్రభుత్వం నుంచి తీసుకురావాలని కోరాలన్నారు. కౌన్సిల్‌లో ఆమోదాలే తప్ప అభివృద్ధి పనులు జరగడం లేదని మండిపడ్డారు. మంత్రి చొరవ చూపి కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లింపులు జరిగేలా తద్వారా పట్టణంలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చర్చిసెంటర్ వద్ద కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం టేబుల్ అజెండాలో పెట్టడాన్ని వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు తీరు బాగోలేదని, లంచాలు ఇస్తేగాని పనులు జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అజెండాలో పలు అంశాలపై వాడీవేడిగా చర్చించారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పార్వతీపురం / సాలూరు

9010204441, 9951602891

Office mail : vzmadvt@gmail.com